## మనంకానిదానిని మనంఅని అనుకొంటున్న మూలాన, హృదయగుహలోనికి ప్రవేశించలేకపోతున్నాము

సద్గురు శ్రీ నాన్నగారి అనుగ్రహభాషణములు, 8-2-2001, కేశవరం

ప్రియమైన ఆత్మబంధువుల్లారా,

శరీరం మరణించటం వలన ఎవరికి జ్ఞానం రాదు. శరీరం మరణించటానికి మనం ఏమీ సాధన చేయనక్కరలేదు, ఏదో ఒకరోజు మరణిస్తుంది. శరీరం మరణించకముందే ఎవడి మనస్సు అయితే మరణించిందో వాడికి హృదయంలో ఉన్న సత్యం తెలుస్తుంది. అహంభావన లేకుండా మనిషి ఉండడు. అహంభావన ఉంటే మనిషి, అహంభావనపోతే మహర్షి. మనం అహంభావనను తొలగించుకోవాలి. మనం పూజచేసినా, యజ్ఞంచేసినా, ఏ సాధనచేసినా మనం తొలగించుకోవలసింది ఏమిటి అనే దానిని మర్చిపోకూడదు. ఇప్పుడు మనం కేశవరం వచ్చాము. బంధువుల ఇంటికి వెళ్ళవచ్చు, స్నేహితుల ఇంటికి వెళ్ళవచ్చు కాని ఇక్కడకు వచ్చిన పని మర్చిపోకూడదు. మనం ఇక్కడకు సత్సంగసమావేశానికి వచ్చాము అది మర్చిపోకూడదు. అలాగే మనం ఈ లోకంలోనికి వచ్చిన పని ఏమిటి? ఏది సాధించాలి అనేది మర్చిపోకూడదు. దేహప్రారబ్దంలో ధనం, చదువు, యశస్సు వస్తూ ఉంటాయి, పోతూ ఉంటాయి కాని మనం ఈ లోకంలోనికి వచ్చిన పని మర్చిపోకూడదు. నీవు ఎక్కడున్నా అహంభావనను తొలగించుకోకపోతే జననమరణచక్రంలోనుండి బయటకు రాలేవు. అన్ని మతముల సారము ఒక్కటే. కాని ఒకమతానికి ఇంకోమతానికి, ఒకమనిషికి ఇంకోమనిషికి మధ్య పేచీలు ఎందుకు వస్తున్నాయి అంటే ఈ పేచీలు సృష్టించేది స్వార్ధపరులు. స్వార్ధం ఉన్నవాడికి పరమార్ధం అందదు.

మనం ఏ పనిచేసినా యాంత్రికంగా చేయకూడదు, అశ్రద్ధ పనికిరాదు. ఈశ్వరానుగ్రహం పొందటానికి తగిన అర్హత, యోగ్యత సంపాదించే మాటలు మాట్లాడాలి. ఈశ్వరానుగ్రహం పొందటానికి అనుకూలమైన పనులు చేయాలి. అప్పుడు వర్షం కురిసినప్పుడు భూమి ఎలా తడుస్తుందో అలాగ భగవంతుడు ఆయన అనుగ్రహంతో మనలను తడుపుతాడు. మీకు యోగ్యత, అర్హత ఉన్నా మీకు ఉన్నట్లు కొంతమంది అంగీకరించరు దీనికి అసూయ కారణం అందుచేత మీరు అసూయ వంక చూడకూడదు. పెద్దలు సదాచారంగా బ్రతకమని చెపుతారు అంటే చెడు చూడవలసివచ్చినప్పుడు గుడ్డివాడిగా బ్రతుకు, చెడు మాట్లాడవలసివచ్చినప్పుడు మూగవాడిగా బ్రతుకు, ఎవరైనా ఇతరుల గురించి చెడు చెప్పేటప్పుడు చెవిటివాడుగా బ్రతుకు. ఇలా సదాచారంగా బ్రతికితే ఇంద్రియాలు అణుగుతాయి, మనస్సు అణుగుతుంది, నీకు అంతర్దృష్టి కలుగుతుంది. అంతర్దృష్టి కలిగితేనేగాని

ఆత్మానుభవం పొందలేము. కుండలో అన్నంఉన్నా పైన మూకిడి ఉంటే లోపల ఉన్న అన్నం కనబడదు. అలాగే మన హృదయంలో అమృతత్వం ఉంది కాని పైన మూకిడిలాగ అహంభావన ఉంది. దానిని తీయాలంటే తీయలేకపోతున్నాము ఎందుచేతనంటే ఆ మూకిడి మనకు బంగారంలాగ కనిపిస్తోంది అందువలన దానిని మనం బయటకు గెంటలేకపోతున్నాము అని ఒక ఉపనిషత్‌లో చెప్పాడు. నేను మీ అందరిని హృదయపూర్వకంగా ప్రేమిస్తున్నాను అనుకోండి, ప్రేమించటంలో నాకు స్వార్ధం లేదు అనుకోండి, మీ అందరిపట్ల నాకు ఆప్యాయత ఉంది అనుకోండి, అది కపటంకాదు అనుకోండి నేను పెద్ద సాధనలు చేయనక్కరలేదు నా మనస్సు అణిగిపోతుంది, హృదయగుహలో పడిపోతుంది. మనం కొన్ని చిట్కాలు నేర్చుకోవాలి. మనం ఎన్ని పూజలు, జపాలు చేసినా ఆడంబరంగా జీవిస్తే ఏమి ప్రయోజనం లేదు, అహంభావన పెరిగిపోతుంది. మనం పూజలు చేయకపోయినా ఆడంబరం లేకుండా జీవిస్తే అహంభావన తగ్గిపోతుంది. నీ హృదయంలో సత్యవస్తువు ఉంది. కాని దేహాభిమానం వలన, జీవలక్షణాల వలన వస్తువులోపల ఎంత ప్రత్యక్షముగా ఉన్నప్పటికి, ఉన్నట్లు మనకు అవగాహన కావటంలేదు. గురువు ఆ వస్తువును తెచ్చిఇవ్వడు. అది నీ హృదయంలోనే ఉంది. ఏ దేహాభిమానం వలన, జీవలక్షణాల వలన ఆ వస్తువు నీకు వ్యక్తం కావటం లేదో ఆ గుణాలను తొలగించటానికి ప్రయత్నం చేస్తాడు వాడు గురువు.

నీ హృదయంలో ఉన్న వస్తువు చాలా సింపుల్‌గా ఉంది. కాని అది కాంప్లికేటెడ్‌గా ఉంది అని నీవు ఊహించుకొంటున్నావు. నీ ఊహే లోపలున్న వస్తువు నీకు తెలియకుండా అడ్డువస్తోంది. ఎవరో ఇతరులు అడ్డువస్తున్నారని నీవు అనుకొంటున్నావు. ఇలా ఎన్నో జన్మలు వ్యర్ధమవుతున్నాయి. మన బుద్ది నిజంకానిదానిని నిజం అని నమ్ముతుంది, ఆందోళనకు గురిఅవుతుంది. దానిని వదిలివేస్తుంది. మరల ఇంకో అనిజాన్ని పట్టుకొంటుంది. మరల దానిని వదిలేస్తుంది. ఎప్పుడు చూసినా అశాంతి, ఆందోళన, పోరాటం. ఇలా ఎన్నో జన్మలు జరిగిపోతాయి. ఎప్పుడో గురువుఅనుగ్రహం వలన బుద్ధికి దానిమూలమైన సత్యం తెలిసినప్పుడు అది అణుగుతుంది, దాని గూటిలో అది పడిపోతుంది. పంచదార ఉంది అనుకోండి చీమలను మీరురండి, మీరురండి అని పంచదార పిలవనక్కరలేదు. వాటి అంతట అవే పంచదార దగ్గరకు వచ్చేస్తాయి. అలాగే ఎవడికైతే ఆత్మానుభవం కలిగిందో వాడి దగ్గరకు జీవకోటి అంతా ఆకర్షించబడుతుంది. వాడు సమాజం మధ్యలోఉన్నా, గుహలోఉన్నా ఆ ఉపాధిద్వారా ఎవరైతే తరించబడవలసిఉందో వారు అంతా ఆకర్షితులవుతారు. ఆయన సన్నిధిలో నీ లోపల అవ్యక్తంగాఉన్న వస్తువు నీకు గోచరమవుతుంది. కృష్ణుడు L.K.G.వారికి, U.K.G.వారికి కూడా పనికి వచ్చేవిధంగా చెపుతాడు. నాకు పుష్పాన్నిఇయ్యి, పండునుఇయ్యి లేకపోతే

నీరుఇయ్యి అని చెపుతాడు. కాని భగవాన్ ఏమంటారు అంటే ఇది త్యాగమా? అహంభావనను విడిచిపెట్టటమే త్యాగం అని చెపుతారు. కాని కృష్ణుడు అలా ఎందుకు చెపుతున్నాడు అంటే మనలను ప్రిపేర్ చేయటానికి పండుఇయ్యి, పుష్పంఇయ్యి అంటే నెమ్మదిగా ఆ ఎత్తుకు తీసుకొని వెళ్లటానికి కృష్ణుడు చేసిన ప్రయత్నం ఇది, అంటే త్యాగబుద్ధిని నేర్పటంకోసం చేసిన ప్రయత్నం. త్యాగబుద్ధి ఎందుకంటే మనం కానిదానిని విడిచిపెట్టటం కోసం. ప్రతీజన్మలోకూడా పూజలు, జపాలు, ఏవో సాధనలు చేస్తూనే ఉంటాము. కాని మనస్సులో మనం కానిదానిని మనం అని అనుకొంటూనే ఉంటాము. అందువలన హృదయగుహలోనికి ప్రవేశించలేకపోతున్నాము, కనీసం ఆ సమీపంలోనికికూడా వెళ్లలేకపోతున్నాము.

గురువు ఏమి చేస్తాడు అంటే మనకు ఇష్టమైన వారిచేత తిట్టిస్తాడు ఎందుచేతనంటే వారిని హృదయంలో మోస్తూ ఉంటాము. హృదయంలో ఎవరిని మోస్తున్నారో గురువుకు తెలుసు. ఆ మోత తగ్గించటం కోసం వారిచేత తిట్టిస్తాడు. ఆ నాలుగు మొట్టికాయలు పడితేగాని ఆ మోత ఆగదు. నీ లోపల ఏముందో నీకు తెలియదుగాని గురువుకు తెలుస్తూఉంటుంది. ఎందుచేతనంటే నీలోపల అంతర్యామిగా ఉన్నాడు. బ్రహ్మానుభవం కలగటానికి ఏ సంస్కారములయితే నీకు అడ్డుగా ఉన్నాయో వాటిని తొలగించటానికి నిరంతరం, నిర్విరామంగా గురువు కృషిచేస్తూనే ఉంటాడు. అవసరమైతే నీకోసం శరీరం ధరించివస్తాడు, నీ లోపలనుండి గైడెన్స్ ఇస్తూఉంటాడు. ఆ గైడెన్స్ నీకు అర్థంకానప్పుడు బాహ్యంగా ఒక శరీరం ధరించి నీకు టీచ్‌చేయటం కోసం వస్తాడు. వాడు గురువు. ఇవిఅన్నీ మీకు అందకపోయినా గురువును ఒక పెద్దచుట్టం అని అనుకోండి. నీవు ఎన్ని శాస్త్రాలు చదివినా, ఎన్ని నదులలో మునిగినా గురువు అనుగ్రహానికి అవి సాటికావు. ఎన్ని రచనలుచేసినా, ఎన్ని ప్రవచనాలుచేసినా గురువుయొక్క మౌనంలోఉన్న శక్తిని, గురువుయొక్క మాటలోఉన్న శక్తిని వర్ణించలేరు. గురువు చేసే పని మనం గ్రహించాలి అనుకొన్నా అది నీకు అందదు. అది నీకు అందటంలేదు కాబట్టి గురువు పనిచేయటంలేదు అని నీకు అనిపిస్తుంది. లోపలున్న వస్తువు మాటకు అందదు, మనస్సుకు అందదు. ఎక్కడైతే మాట అణిగిందో, మనస్సు అణిగిందో అక్కడ అది వ్యక్తమవుతుంది. ప్రపంచం లేనేలేదు. నీ అహంభావనే ప్రపంచంక్రింద కనిపిస్తోంది. అహంభావన అణగకుండా ప్రపంచం అణగదు. ఎవడికైతే అహంభావనపోయిందో ఈ లోకంఅంతాకూడా వాడి హృదయంలో ఐక్యమయిపోతుంది.